# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 10-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి.**
2. **రైతన్నలకు ఇస్తున్న ప్రాధాన్యతను నేతన్నలకు కూడా ఇస్తున్నామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.**
4. **తెలంగాణాలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**
5. **న్యూజిలాండ్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.**

==========================

రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు నేటి నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 2025 -26 సంవత్సరానికి గ్రాంట్ల డిమాండ్లకు సంబంధిత బిల్లుపై చర్చ, ఓటింగ్  జరగనుంది. వీటితో పాటు కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ఇమ్మిగ్రేషన్, ఫారినర్స్ బిల్లు, రైల్వే సవరణలతో సహా పలు బిల్లులను కేంరదం ప్రవేశపెట్టనుంది .

---------------------------

రైతన్నలకు ఇస్తున్న ప్రాధాన్యతను నేతన్నలకు కూడా ఇస్తున్నామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిన్న జరిగిన పద్మశాలీల మహాసభలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల్లోని వారికి రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. 1.30 కోట్ల చీరలు నేసే ఆర్డర్లను రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అప్పగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంచేస్తూ...

..వాయిస్..32 సెకన్లు

---------------------------

పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ

మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు పార్టీ కార్యాలయంలో ఆయన 90 మంది లబ్ధిదారులకు 65.54 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్దే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, ప్రజలు వాటిని ఉపయోగించుకోవాలని కోరారు.

-----------------------------

తెలంగాణాలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... 58 రెసిడెన్షియల్ పాఠశాలలకు 11 వేల 600 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ జీవో జారీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర విద్యారంగంలో ఇది విప్లవాత్మక నిర్ణయమని ఆయన తెలియచేస్తూ...

..వాయిస్.. 34 సెకన్లు

-----------------------------

విద్య మానవ అభివృద్ధికి, సామాజిక మార్పుకు దోహదం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ  శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లెలో 8 కోట్ల రూపాయలతో  నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాలను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ .. విద్యారంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని  పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సైతం విద్యార్థులు సద్వినియెగం చేసుకొవాలని మంత్రి తెలియజేస్తూ...

...వాయిస్.. 34 సెకన్లు

-----------------------------

దుబాయ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేయగా ఈ లక్ష్యాన్ని భారత్ 49 ఓవర్ల లోనే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కాగా భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం ఇది మూడోసారి.

కాగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి  నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం పేపర్ -2బి, జంతుశాస్త్రం పేపర్-2, చరిత్ర పేపర్-2 పరీక్షలకు సెట్ నెంబరు 2 ప్రశ్నాపత్రం ఎంపిక చేశారు.

కాగా తెలంగాణలో ఈరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్ -2 పరీక్ష జరగనుంది.

-----------------------------

గ్రామీణ యువత మాదకద్రవ్యాలను వినియోగించకుండా పోలీస్ అధికారులు వారి కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచించారు. మూలుగు జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయంలోని సమావేశ మందిరాన్ని నిన్న మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... శాంతిభద్రత విషయంలో రాజీ పడకుండా మరింత మెరుగైన సేవలు అందించాలని, సమావేశ మందిరం అందుబాటులోకి రావడంతో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం మరింత సులువవుతుందని పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటించి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈరోజు సాయంత్రం పుట్టపర్తి విమానాశ్రయం చేరుకొని, రోడ్డు మార్గం ద్వారా కదిరి చేరుకుంటారని, శ్రీ ఖాద్రి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరపున మంత్రులు పట్టు వస్త్రాలు సమర్పించి, అనంతరం కళ్యాణ ఉత్సవంలో పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

-------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కన్నుమూశారు. తిరుపతిలోని తన స్వగృహంలో నిన్న తుది శ్వాస విడిచారు. దాదాపు వెయ్యికి పైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వర కల్పన చేసిన గరిమెళ్ల.. ప్రముఖ సంగీత విద్వాంసుడిగా ప్రఖ్యాతిగాంచారు. సంప్రదాయ కర్ణాటక, లలిత, జానపద సంగీతంలోనూ ఆయన ప్రసిద్ధులు. గరిమెళ్ళ మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

-------------------------

తెలంగాణలో చేనేత కార్మికులకు 33 కోట్ల రూపాయలు రుణ మాఫీ చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా చేనేత కార్మికులకు లక్షరూపాయల వరకు ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణ బకాయిలను మాఫీ చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

-------------------------

పి4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలను వేగవంతం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆకివీడులో నిర్వహిస్తున్న పి 4 సర్వే ను నిన్న కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటి నుంచే పని చేయడానికి ఆసక్తి ఉన్న చదువుకున్న యువతీ యువకులను గుర్తించేందుకు ఉద్దేశించిన వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే లో సేకరించాల్సిన అంశాలను వివరించారు. పి – 4 సర్వేలో ఎటువంటి తప్పులు ఉండకూడదని అన్నారు.

=====================